నిరుద్యోగ యువతకు శిక్షణ

అమీర్‌పేట్, డిసెంబర్ 14: టెక్ మహేంద్ర ఫౌండేషన్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ (హైదరాబాద్) తరపున నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్ హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తోంది. ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హతలున్న 19 నుంచి 28 ఏండ్ల మధ్య వయసున్న యువతకు అవకాశం ఉన్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఈనెల చివర్లో ప్రారంభం కానున్న బ్యాచ్‌లో మహిళా అభ్యర్థులకు 50 శాతం స్కాలర్‌షిప్ సదుపాయం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న (మెట్రో పిల్లర్ నంబర్-ఎ 980) సెయింట్ థెరిస్సా చర్చి కంపౌండ్‌లో ఉన్న టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో లేదా 73373 32606లో సంప్రదించాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి కోరారు.

సేవ చేయడానికి యువతరం ముందుకు రావాలి

సికింద్రాబాద్, డిసెంబర్ 14: పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం దాగి ఉంటుందని ప్రముఖ న్యాయవాది పాక నవీన్ బాబు పేర్కొన్నారు. ఇన్‌స్పైరింగ్ యూత్ ఫౌండేషన్ సంస్థను శనివారం ఆయన ప్రారంభించిన సందర్భంగా ఆయన వారాసిగూడలోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌బాబు మాట్లాడుతూ యువతరానికి రాజ్యాంగం, కేంద్ర, రాష్ట్ర పాలన, విధి విధానాల గురించి వివరించడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా అన్నారు. వాటితో పాటు పేదవారికి న్యాయ సూచనలు, సలహాలు ఇవ్వడం, విద్య, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, యువతను చైతన్య పరచడం సంస్థ ఉద్దేశమని పేర్కొన్నారు.

కాళోజీ వర్సిటీ మహిళా బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 14: కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మహిళా బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక ప్రక్రియ గాంధీ వైద్య కళాశాలలో జరిగింది. ఈనెల 20 నుంచి 24 వరకు కేరళ, కొట్టాయంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో జరుగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జట్టు పాల్గొంటుంది. జట్టులో తెలంగాణాలోని ఉస్మానియా, అపోలో, అరుంధతి, మమత, మల్లారెడ్డి వైద్య కళాశాల నుంచి విద్యార్థులను ఎంపిక చేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర, గాంధీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వేణు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన పీడీలు సందీప్‌కుమార్‌జాదవ్ (ఉస్మానియా), ఎంఏ ఖదీర్ (డెక్కన్), శ్రీనివాస్ (అపోలో), రమేశ్ (మమత కాలేజీ)లు ఎంపికైన జట్టు సభ్యులను అభినందించారు.

ఓబీసీ జాబితాలో 28 కులాలను చేర్చాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 14: ఓబీసీ జాబితాలో లేని 28 కులాలను తక్షణమే ఓబీసీ జాబితాలో చేర్చాలని పలువురు ఓబీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఓబీసీ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తిపిరిశెట్టి అధ్యక్షతన కేంద్ర జాబితాలోలేని కులాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, శివాజీ, మోహన్ చౌహాన్ మాట్లాడుతూ ఏండ్లుగా కేంద్ర ఓబీసీ సర్టిఫికెట్ లేక రాష్ట్రంలో ఆ కులాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ బీసీ కమిషన్ విచారణ చేసి నివేదిక కేంద్రానికి పంపినా జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ కేంద్రం దృష్టికి విషయం తీసుకెళ్తానని అన్నారు. సమావేశంలో చెట్టిపల్లి శివాజీ, వేముల శ్రీనివాస్, ప్రవీణ్, వేదాకర్, బొప్పాల శ్రీనివాస్ బాబు, రామస్వామి, మనోహర్ పాల్గొన్నారు. అనంతరం ఓబీసీ సాధన సమితి రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం

బన్సీలాల్‌పేట్ ముస్లిం శ్మశానవాటికలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 14: ముస్లిం శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి శనివారం ఆయన ముస్లిం శ్మశానవాటికలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల మహమ్మదీయ మసీదు కమిటీ ఇచ్చిన వినతిపత్రం ప్రకారం, శ్మశానవాటికలో రోడ్డు, లైట్లు, తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఉన్నాయని గుర్తించామని అన్నారు. త్వరితగతిన అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తాను వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. చనిపోయిన అనంతరం వచ్చేది శ్మశానవాటికకేనని, అందుకే అక్కడ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జావేద్, కార్యదర్శి అన్వర్, ఫహీం, అబ్బాస్, జహంగీర్, శాబుద్దీన్, హుస్సేన్, రుక్ముద్దీన్, నుస్రత్, షకీల్, కె.లక్ష్మిపతి, వెంకటేశన్‌రాజు, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల వైద్య సేవలకు సహకారం

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సికింద్రాబాద్, డిసెంబర్ 14: నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.27 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మంచి వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ప్రస్తుత రోజుల్లో వివిధ మార్గాల్లో వారిని ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేస్తున్నామని తెలిపారు. అత్యవసర సందర్భాల్లో సితాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని, ఎవరికీ లంచాలు చెల్లించాల్సిన అవసరం లేదని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటూ కష్టపడి చదవాలి

- గురుకుల పాఠశాల సందర్శనలో నగర సీపీ సీవీ ఆనంద్
- ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని వసతి గృహాల్లో విద్యార్థులతో ముచ్చటించిన సీపీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, డిసెంబరు 14 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటూ కష్టపడి చదవి అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ విద్యార్థులకు సూచించారు. గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, రాజకీయ నాయకులు గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించాలని సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నగర సీపీ సీవీ ఆనంద్ శనివారం ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌ను సీపీ సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వసతి గృహంలో ఉన్న సమస్యలు, సౌకార్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంకాల అల్పాహారం, రాత్రి భోజనం నాణ్యత గురించి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. పిల్లలకు ఏ విధమైన డైట్ ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.వాణిశ్రీ, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ డా.కె.చల్లాదేవితో కలిసి పాఠశాలలోని వంటగది, మూత్రశాలలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, స్పోర్ట్ గదులు, విభాగాలను సీపీకి స్వయంగా చూపించారు. అనంతరం సీపీ ఆనంద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వం కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో సహాయపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వస్తువులు నాణ్యమైన, మెరుగైనవి ఉన్నట్లు సీపీ వివరించారు. రాష్ట్రంలోని అన్ని సాంఘీక, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మరింత మంచి పోషకాహారాం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.500 కోట్ల బడ్జెట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నీట్ వంటి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల కృషి వల్లే విద్యార్థులు ఇంత గొప్ప విజయాలను సాధించారని అభినందించారు.

నగర సీపీ సీవీ ఆనంద్‌తో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శనివారం పరామర్శించారు. సన్నీదానంలో ఆయనను కలిసి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసున్నారు. మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, మహ్మద్‌అలీ, శంకర్‌గౌడ్, కల్యాణ్, సాయి, కష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్, డిసెంబర్ 14:

అగ్ని ప్రమాద నివారణపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి

అమీర్‌పేట్, డిసెంబర్ 14: అగ్నిప్రమాదాలు సంభవిస్తే, మంటల నియంత్రణపై సనత్‌నగర్ అగ్నిమాపక అధికారులు శనివారం సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాలలో అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ ఎనపోతుల రాజు తన సిబ్బందితో కలిసి నిర్వహించిన ప్రత్యక్ష విన్యాసాలు, సూచనలు వైద్యులు, అధికారులు, సిబ్బంది ఆసక్తిగా గమనించారు. కార్యక్రమంలో భాగంగా మంటలు చెలరేగేందుకు గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సనత్‌నగర్ అగ్నిమాక కేంద్రం డ్రైవర్ ఆపరేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఫైర్‌మెన్లు ఎంజే ప్రసాద్, దుర్గా ప్రసాద్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

ముషీరాబాద్, డిసెంబర్ 14: ప్రభుత్వ హాస్టల్స్‌లో మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ ఎస్సీ బాలికల వసతి గృహంలో కామన్ డైట్ మెనూను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహాల్లో మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటీవలి కాలంలో ఎక్కడా చూసినా కల్తీ ఆహార పదార్థల సరఫరాతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘనటలు ఉన్నాయని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల పట్ల వార్డెన్లు, సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శాంతి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి భానుప్రియ, డిప్యూటీ తహసీల్దార్ రఘువిష్ణు, రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ గౌడ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



దివ్యాంగ విద్యార్థితో బీఆర్ఎస్ యువ నాయుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, డిసెంబర్ 14: దివ్యాంగ విద్యార్థి ఫీజు కోసం ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ యువ నాయుకుడు ముఠా జయసింహ అందజేశారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన గిద్దె విష్ణు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. కంప్యూటర్ కోర్సు సైతం నేర్చుకుంటున్నారు. హాస్టల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం ముఠా జయసింహను కలవడంతో ఆయన వెంటనే స్పదించి ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం అందిస్తాని చెప్పారు. కార్యక్రమంలో గాంధీనగర్ వాచ్‌మెన్ యూనియన్ నేతలు ఈదురు సత్యనారాయణ, జి. నరేశ్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మెడికో.. మూడు 'ఐపీ' కుటుంబాల దత్తత

సమావేశంలో మాట్లాడుతున్న డీన్ డాక్టర్ శిరీశ్‌కుమార్ జి.చవాన్

అమీర్‌పేట్, డిసెంబర్ 14: ఈఎస్ఐసీ వైద్య కళాశాలలో చదువుతన్న ప్రతి వైద్య విద్యార్థి, ఎన్ఎంసీ నిర్దేశించిన విధానాల మేరకు మూడు ఇన్సూర్డ్ పర్సన్ (ఐపీ) కుటుంబాలను ఆరోగ్య భద్రతా పరంగా దత్తత తీసుకోనున్నట్టు ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ శిరీశ్‌కుమార్ జి.చవాన్ పేర్కొన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెడికల్ సోషల్ వర్కర్ల సహకారంతో మెడికోలు మూడు కుటుంబాలను ఎంపిక చేసుకుంటారని చెప్పారు. ఎంపిక చేసుకున్న కుటుంబ సభ్యుల వైద్య ఆరోగ్య పరిస్థితులను వారంలో ఒకరోజు స్వయంగా వెళ్లి పరీక్షిస్తారని తెలిపారు. ఆ విధంగా విలువైన తమ వైద్య సేవలను బీమాదారులకు అందిస్తున్నారన్నారు. శ్రీమాతా సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ సహకారంతో శనివారం సనత్‌నగర్ బీకేగూడ ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈఎస్ఐసీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ దేవీదాస్ జి.తొంద్రె ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి డాక్టర్ శిరీశ్‌కుమార్ చవాన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఈఎస్ఐసీ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుధాబాల, డాక్టర్ సురేంద్రబాబు, మెడికల్ సోషల్ వర్కర్ పాల్‌సన్‌తో పాటు సమితి ప్రతినిధులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, ఆదిత్యనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సామాజికవేత్త షాబాద్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులంతా కలిసి కట్టుగా ఉండాలి

గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న గంగపుత్ర సంఘం నాయకులు

సికింద్రాబాద్, డిసెంబర్ 14: గంగపుత్రులంతా కలిసి కట్టుగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని స్థానిక గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు పిలుపునిచ్చారు. సంఘ సభ్యుల కోసం చేపలు అమ్మడానికి గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మూడు రోజులుగా 900 మందికి కార్డులు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ గంగపుత్రులు అందరూ ప్రభుత్వం ప్రకటించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత, మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. హచ్ దర్శక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్థ కోఆర్డినేటర్ రాజుయాదవ్ బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో వంగాల సుధాకర్, సదానంద్, శివ, నవీన్, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, డాక్టర్ చేతి రఘు, నాగుల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కామన్ మెనూ డైట్ ప్లాన్ ప్రారంభం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

మారేడ్‌పల్లి, డిసెంబర్ 14: మహేంద్రహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 'కామన్ మెనూ డైట్ ప్లాన్' కార్యక్రమాన్ని శనివారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. హాస్టల్, పాఠశాలలో సోలార్ హీటర్, ఇన్‌వర్టర్, ల్యాబ్ కోసం అదనపు గదులు కావాలని విద్యార్థినులు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి పాఠశాల అభివృద్ధి కోసం రూ.25 లక్షల నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం మంత్రి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శారద, ప్రిన్సిపాల్ సునీత, ఇందిర, ఆయా పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మందులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, డిసెంబర్ 14: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. శనివారం అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్, కిమ్స్ ఫౌండేషన్ రిసెర్చ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్, శివశక్తి ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు మంజుగుప్తా, రామచంద్ర, రమణి, రాజ్‌శ్రీరాం, నరసింహారావు, కృష్ణమోహన్, రాబర్ట్, రాజేంద్రకుమార్, జనహిత ప్రతినిధులు నర్సింహమూర్తి, వెంకటనారాయణ, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, రాజు, ఎల్లమ్మ, మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ బి.నర్సింగారావు, విక్రమ్ పాల్గొన్నారు.

బేగంపేట్ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప స్వాముల మిత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిత్యాన్నదానంలో బేగంపేట్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు. ఆయన తన వంతు సహాయ సహకారం అందించినట్టు మిత్ర బృందం సభ్యులు బాలరాజ్, శైలెందర్‌యాదవ్ తెలిపారు.

– బేగంపేట్